క్లుప్తంగా

అభివృద్ధిపై దృష్టి సారించాలి

• డీపీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి



ఎంపీడీఓ రామాంజనేయులుకు పుష్పగుచ్ఛమిస్తున్న నేతలు

కోవూరు : గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా దృష్టి సారించాలని డీపీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చూడాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలియజేశారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ఎక్కడా పొరపాటు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, వైస్ ఎంపీపీలు శివుని నరసింహారెడ్డి, సాయిలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. తొలుత నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ రామాంజనేయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు.

గ్రంథాలయ అభివృద్ధికి సహకారం ప్రశంసనీయం

• గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కుమార్‌రాజా



గ్రంథాలయానికి బీరువాలను అందజేస్తున్న నీలకంఠరెడ్డి

కొడవలూరు: గ్రంథాలయ అభివృద్ధికి దాత అందించిన సహకారం ప్రశంసనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.కుమార్‌రాజా కొనియాడారు. మండలంలోని యల్లాయపాళెం శాఖా గ్రంథాలయంలో పుస్తకాలను భద్ర పరుచుకునేందుకు రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ కరేటి నీలకంఠరెడ్డి రూ.25 వేల విలువైన రెండు బీరువాలు ఆదివారం వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన కుమార్‌రాజా మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహద పడుతాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని దాత సహకారం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో దాతను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు భాషా సమితి అధ్యక్షుడు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఏకొల్లు యుగంధర్ రెడ్డి, రిటైర్డ్ టీచర్ కట్టా ప్రభాకర్‌రెడ్డి, కరేటి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి రాఘవరెడ్డి, ఏటూరి పెంచలరెడ్డి, మందిపాటి వినయ్‌కుమార్‌రెడ్డి, మన్నవరపు సుధాకర్, తమ్మిరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సై శివకృష్ణారెడ్డికి ఘన సన్మానం



ముత్తుకూరు : మండలంలో నాలుగున్నర ఏళ్లకుపైగా సేవలు అందించిన ఎస్సై శివకృష్ణారెడ్డి అన్నివర్గాల మన్ననలు, అభిమానం చూరగొన్నారని పలువురు వక్తలు కొనియాడారు. ముత్తుకూరు ఎస్సైగా పనిచేస్తూ ఇటీవల నెల్లూరు ఎస్‌బీకి బదిలీ అయిన శివకృష్ణారెడ్డిని ఆదివారం మత్స్యకళాశాల ఆడిటోరియంలో ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధనరెడ్డి, అదానీ కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సెక్యూరిటీ జీఎం వెంకటేష్ భాస్కరన్, పి.హేమంత్‌రెడ్డి, ఎస్సైలు శ్రీనివాసులురెడ్డి, శివనాంచారయ్య, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని శివకృష్ణారెడ్డి సేవలను కొనియాడారు.

దోమల నివారణకు చర్యలు

కొడవలూరు : మండలంలోని రామన్నపాళెంలో సర్పంచ్ కె.ధనమ్మ ఆధ్వర్యంలో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. గ్రామంలోని డ్రెయినేజీ కాలువలు పూడికతో నిండి ఉండడం, రోడ్ల వెంబడి చెత్తా చెదారాలు పేరుకుపోయి ఉండడం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉండేది. దీంతో సర్పంచ్ ధనమ్మ ఆదివారం రోడ్ల వెంబడి చెత్తను తొలగించడంతో పాటు డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూడికతీత పనులు పూర్తయ్యాక గ్రామంలో ఫాగింగ్ చేయిస్తామని, తద్వారా దోమల బెడదను పూర్తిగా నివారిస్తామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



హోరాహోరీగా సాగుతున్న పోలీస్ టైగర్స్, రెవెన్యూ రాయల్స్ మ్యాచ్



తలపడుతున్న మున్సిపల్ కార్పొరేషన్ ఫైటర్స్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ చాలెంజర్స్ జట్లు

• హుషారుగా తలపడిన జిల్లా అధికారుల జట్లు

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి క్షణం తీరిక లేకుండా విధుల్లో నిమగ్నమైన అధికారులు అన్నీ మర్చిపోయి తోటి ఉద్యోగులతో క్రికెట్ పోటీల్లో సరదాగా ఆదివారం గడిపారు. నగరంలోని పోలీస్ కవాతు మైదానం దీనికి వేదికైంది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్ పోటీలను జరిపారు. కలెక్టర్ కెప్టెన్‌గా రెవెన్యూ రాయల్స్, ఎస్పీ కెప్టెన్‌గా పోలీస్ టైగర్స్, నగరపాలక సంస్థ కమిషనర్ కెప్టెన్‌గా మున్సిపల్ కార్పొరేషన్ ఫైటర్స్, డీఆర్డీఏ పీడీ కెప్టెన్‌గా డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ చాలెంజర్స్ జట్లు పోటీల్లో తలపడ్డాయి.

• తొలుత రెవెన్యూ రాయల్స్, పోలీస్ టైగర్స్ జట్ల మధ్య 12 ఓవర్ల మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పోలీస్ టైగర్స్ జట్టు 4 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన రెవెన్యూ రాయల్స్ జట్టు లక్ష్యాన్ని చేధించలేక ఓటమిపాలైంది. దీంతో పోలీస్ టైగర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌తో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి.. బౌలింగ్‌తో కలెక్టర్ హరినారాయణన్ ఆకట్టుకున్నారు.

• రెండో మ్యాచ్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ఫైటర్స్ 12 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ చాలెంజర్స్ జట్టు ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో కార్పొరేషన్ ఫైటర్స్ విజేతగా నిలిచింది.

• ఈ నెల 18న పోలీస్ టైగర్స్, మున్సిపల్ కార్పొరేషన్ ఫైటర్స్ జట్ల మధ్య ఫైనల్స్ జరగనుంది.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం సహాయనిధి ద్వారా బాధితులకు ఆర్థిక సాయాన్ని అందజేసి అండగా నిలుస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి రూ.10.25 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను డైకస్‌రోడ్డులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం అందజేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అనేక వ్యాధులను చేర్చి వైద్యసేవలను సమర్థంగా అందిస్తున్నారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు సంబంధించి బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నామని తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన



నెల్లూరు సిటీ: నగరంలోని ఎంజీబీ మాల్లో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కేన్సర్ నుంచి ఎలా బయటపడాలనే అంశమై సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించారు. మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ హెడ్ బింధు భార్గవరెడ్డి, సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, డాక్టర్ రంగరామన్, అవినాష్, శ్రీవిద్య, శ్రీనివాసులురెడ్డి, ప్రియ, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీలకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని 72 జట్లు హాజరయ్యాయి. 35, 40, 45, 50, 55, 60, 65, 70, 75+ విభాగాల్లో పురుషులు, మహిళలకు పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల వీర వెంకటేశ్వర్లు అందజేశారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారని వివరించారు. అసోసియేషన్ సభ్యుడు తాళ్లపాక వరప్రసాద్, కోచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అన్నదానాన్ని సేవా సంస్థలు, ఏపీ ఎన్జీఓల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 250 మందికి అన్నదానం చేశారు. అమ్మా యూత్ ఫౌండేషన్ నిర్వాహకుడు రమేష్‌బాబు, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సువర్ణ, రమేష్‌రాజ్, శ్రీధర్, కల్యాణి, సుప్రజ, వీణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్‌కు నివాళి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్వాతంత్ర్య సమరయోధుడు, బిహార్ మాజీ సీఎం కర్పూరి ఠాకూర్‌కు నెల్లూరు జిల్లా నాయీబ్రాహ్మణ సంఘ నేతలు ఆదివారం నివాళులర్పించారు. నవాబుపేటలోని నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వేలూరు రంగారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డును ప్రకటించడంపై ఆనందం వ్యక్తం చేశారు. హజరత్తయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చేనేతల భారీ ర్యాలీ



నెల్లూరు(మినీబైపాస్): చేనేతల సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు. ఈ మేరకు మైపాడు గేట్ సెంటర్ నుంచి డీజీపీ కల్యాణ మండపం వరకు ర్యాలీని ఆదివారం నిర్వహించారు. డాక్టర్ జెడ్ శివప్రసాద్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ దొంతు శారద, చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, గౌరవాధ్యక్షుడు నందం అశ్వత్థామ, జనరల్ సెక్రటరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రామికనగర్‌లో సందడి



నెల్లూరు రూరల్: కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్‌లో గల ఖాజా గరీబ్ నవాజ్ దర్గా గంధ మహోత్సవాన్ని పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లితెర నటులు సందడి చేశారు. నిర్వాహకులు చాన్‌బాషా, నవీన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, షాజహాన్, మురళి, సుధ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భగవద్గీత ప్రచారం



ప్రచారం చేస్తున్న కమిటీ బాధ్యులు

పొదలకూరు : మండలంలోని విరువూరు, సూరాయపాళెం గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఆధ్యాత్మికతపై అవగాహన కల్పించి దేవాలయాల్లో రహస్యాలు, హిందుత్వంలో సాంప్రదాయాలు, పండగల విశిష్టతలను వివరించారు. వేమన పద్యాల్లోని జ్ఞానాన్ని తెలియజేసి ఆచరించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచల నర్సయ్య, సభ్యులు కొండయ్య, భాగ్యమ్మ, కృష్ణయ్య, గాయత్రి, నర్సారెడ్డి, సరోజనమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్ రేపు

కావలి: ఈ నెల 6న కావలి విద్యుత్ డీఈఈ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరుగుతుందని డీఈఈ బెనర్జీ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవచ్చన్నారు. కావలి, కలిగిరి, అల్లూరు సబ్ డివిజన్స్‌కు సంబంధించిన వినియోగదారులకు తమ సమస్యలకు తగిన పరిష్కారాన్ని చూపే విధంగా కృషి చేస్తామన్నారు.

కార్పొరేషన్లో 'స్పందన' నేడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నామని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై నేటి నుంచి అవగాహన

నెల్లూరు(బారకాసు): వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఫేజ్ – 2లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని 28 ప్రాంతాల్లో ప్రచార వాహనం, శిబిరాల ద్వారా సోమవారం నుంచి రెండు వారాల పాటు అవగాహన క్యాంపులను నిర్వహించనున్నామని వివరించారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం.. అవగాహన.. ఆధార్ అప్‌డేట్.. బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు తదితరాలపై అవగాహన కల్పించనున్నారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి



వెంకటశేషయ్య ఆచారిని సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానని పార్టీ నగర ఉపాధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి పేర్కొన్నారు. నగరంలోని సంఘ కార్యాలయంలో వెంకటశేషయ్య ఆచారి అభినందన కార్యక్రమాన్ని విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పెద్దపీట వేశారని కొనియాడారు. పోలినేని సదాశివయ్య ఆచారి, జానకిరామయ్య, తల్లం సురేష్, ఏలూరి బాబు, వేములూరు రఘురామయ్య, పాలూరు చంద్ర, కాకులూరి సురేష్, మదన్‌మోహన్, ఉదయగిరి నిరంజన్, శానంపూడి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డిప్యూటీ మేయర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను నగరంలోని ఆమె నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వీనులవిందుగా గాత్రకచేరి



నెల్లూరు(బృందావనం): గట్టుపల్లి లలితాంబ శతజయంతిని పురస్కరించుకొని నగరంలోని పురమందిరంలో అన్నమయ్య సౌరభాలు కార్యక్రమాన్ని సంగీత కళాకారుల ఆధ్వర్యంలో గసల్ సేవా సంస్థ నేతృత్వంలో ఆదివారం నిర్వహించారు. మృదంగ కళాకారుడు, కంచికామకోటి పీఠ ఆస్థాన విద్వాంసుడు కానూరి వెంకటరామకృష్ణ ఆధ్వర్యంలో టీటీడీకి చెందిన గాయకులు వాసాప్రసాద్, వైష్ణవి ఆలపించిన అన్నమాచార్య కీర్తనలకు చావలి ప్రసాద్, సాయి, లక్ష్మీనారాయణ వాద్యసహకారం అందించారు. ఈ సందర్భంగా కళాకారులను సత్కరించారు. బాలార్క, పద్మాసిని, విద్యాసాగర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, గట్టుపల్లి ఆదిశేషు, డీవీఎస్ శాస్త్రి, దుర్భా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

9న వెంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం వద్ద శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల తొమ్మిదిన నిర్వహించనున్నామని వికాస్ ప్రజాహిత సేవా సమితి అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను బాలాజీనగర్‌లోని సేవా సమితి కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరి గోత్రనామాలతో పూజలు నిర్వహించి.. వేదపండితుల ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు, ముత్యాల తలంబ్రాలను అందజేయనున్నామని వివరించారు. మూలాపేట, ఉస్మాన్‌సాహెబ్‌పేట శివాలయాల చైర్మన్లు లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, రమణకుమార్, సీతారామస్వామి మందిర కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లుగుప్తా, ప్రసాద్ రెడ్డి, తమ్మినేని పాండు, కిషోర్, రామాంజనేయ రెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణ, రఘుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లూరు(బారకాసు): రూరల్ పరిధిలోని 20వ డివిజన్లో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులుగా పోటీ చేయనున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నేతలు పద్మజాయాదవ్, రమాదేవి, దువ్వూరు భాస్కర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, దామోదర్‌రెడ్డి, రమణారెడ్డి, శేఖర్, వెంకటరమణయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సార్కే'లో పుస్తకావిష్కరణ



నెల్లూరు రూరల్: మాగుంట లేఅవుట్లోని ఎస్కార్కే స్కూల్ కరస్పాండెంట్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రూపొందించిన విద్య, ఉపాధి, ఉద్యోగ పుస్తకాన్ని ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత వైస్ చాన్సలర్ మురళి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి విద్యారంగానికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. పుస్తకాన్ని ఉపాధ్యాయులు చదివి విద్యార్థులకు తగిన మార్గాన్ని నిర్దేశించాలని కోరారు. పుస్తకాన్ని ఉచితంగా అందించడాన్ని అభినందించారు. పుస్తక వ్యాసకర్తలు గోపీకృష్ణ, చెంగల్‌రాయశెట్టి, రమణయ్య, డాక్టర్ సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, సురేష్, గమనం, రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.